క్లుప్తంగా

ఈబీసీ నేస్తం విడుదలపై మహిళల హర్షం



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు

కాకినాడ: ఈబీసీ నేస్తం నిధులు విడుదల చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ మహిళలు సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. స్థానిక 41వ డివిజన్‌లో పార్టీ నాయకులు గోడి వెంకట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ గోడి సత్యవతి మాట్లాడుతూ మాట ప్రకారం హామీలు అమలు చేసిన సీఎంకు ప్రతి ఒక్కరూ మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు.

పూడికతీత వేగవంతం చేయండి

కాకినాడ: పూడిక తీత పనులను వేగవంతం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు ఆదేశించారు. గురువారం ఆయన స్థానిక ప్రతాప్‌నగర్, గొల్లలపేట మెయిన్‌రోడ్డు, హౌస్ ఆఫ్ ప్రేయర్ ప్రాంతాల్లో సిల్ట్ తొలగింపు పనులను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. వర్షాలు పడే లోపు పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలు, ప్రజాప్రతినిధుల సమన్వయంతోనే మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణ సాధ్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవివర్మ, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

ఘనంగా అంబేడ్కర్ జయంతి



అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పాఠశాల సిబ్బంది

కరప: మండలం అరట్లకట్టలోని ముత్యాల సుబ్బన్న మెమోరియల్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. జీహెచ్‌ఎం ప్రత్తి సత్యనారాయణ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు తాజుద్దీన్, రాజేశ్వరి, బావిశెట్టి లక్ష్మీనారాయణ, పీఆర్ఆర్ మూర్తి, పీవీ శివగిరి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు. క్రియ స్వచ్ఛంద సంస్థ సూచనల మేరకు విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్, మ్యాప్ పాయింటింగ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు క్రియ సంస్థ సర్టిఫికెట్లు ఇస్తారని ఉపాధ్యాయులు తెలిపారు.

నేడు కలెక్టరేట్‌లో..

కాకినాడ సిటీ: డాక్టర్ అంబేడ్కర్ జయంతిని శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్నారు. జిల్లా స్థాయి వేడుకల్లో భాగంగా కలెక్టరేట్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహానికి కలెక్టర్ కృతికా శుక్లా, ప్రజా ప్రతినిధులు, ప్రజా సంఘాల ప్రతినిధులు నివాళులర్పిస్తారని కలెక్టర్ కార్యాలయ వర్గాలు ఒక ప్రకటనలో తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ చేస్తున్న పోర్టు అధికారి కెప్టెన్ ధర్మశాస్త

కాకినాడ రూరల్: కాకినాడ యాంకరేజీ పోర్టులోని కూలీలు, సిబ్బంది, కార్మికుల సౌకర్యం కోసం గురువారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్, యాంకరేజీ పోర్టు అధికారులు సంయుక్తంగా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని పోర్టు ఆఫీసర్ కెప్టెన్ ధర్మశాస్త ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. మూడు నెలల పాటు మజ్జిగ అందజేస్తామన్నారు. ఏపీ ఎస్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ జి.శ్రీధర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎస్పీఎస్ డీఎస్పీ బి.శ్రీనివాసరావు, ట్రేడ్ యూనియన్ సిబ్బంది హాజరయ్యారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో సత్యాగ్రహ దీక్ష

కాకినాడ సిటీ: కాంగ్రెస్ పార్టీ ద్వారానే దేశంలోని అన్ని వర్గాల ప్రజలు అన్ని మతాలకు సమన్యాయం జరుగుతుందని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు అన్నారు. కేంద్రంలోని బీజేపీ ఆధ్వర్యంలో ఉన్న నరేంద్రమోడీ ప్రభుత్వం దేశంలో ఉన్న అన్ని పరిశ్రమలను అమ్మేసి కార్పొరేట్లకు ఊడిగం చేసి దేశ సంపదను వారికి దోచిపెడుతోందన్నారు. గురువారం కాకినాడ ధర్నా చౌక్ వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సత్యాగ్రహదీక్షను నిర్వహించిన సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి దేశంలో విపరీతమైన ఆదరణ వస్తోందన్నారు. ఈ దీక్షలో మాజీ కేంద్ర మంత్రి మల్లిపూడి మంగపతి పళ్లంరాజు, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు సుంకర పద్మశ్రీ, నాయకులు, వామపక్ష నాయకులు పాల్గొన్నారు. ఈ సత్యాగ్రహ దీక్షకు తాటిపాక మధు, ఎం.రాజశేఖర్, దువ్వా శేషుబాబ్జీ తదితరులు మద్దతు ప్రకటించారు.

సంక్షేమంతో ఆదుకున్నాం.. ఆదరించండి..

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- పాముగుంటలో గడప గడపకూ..



ప్రజలకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: సంక్షేమ పథకాలతో ఆదుకున్నామని, మరోసారి తమను ఆదరించాలని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గడపగడపకూ మన ప్రభుత్వంలో భాగంగా మండలం తమ్మవరం పంచాయతీ పరిధిలోని ఏడీబీ రోడ్డును ఆనుకుని ఉన్న పాముగుంట ప్రాంతంలో, తమ్మవరం నుంచి పండూరు వెళ్లే మార్గంలోని పలు ప్రాంతాల్లో గురువారం సాయంత్రం ఆయన పర్యటించారు. అధికారులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ద్వారా గత మూడున్నరేళ్లలో పొందిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. అందుకు సంబంధించిన వివరాలతో ఉన్న బుక్‌లెట్‌లను అందజేసి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా స్థానికులు, డ్రైనేజీలు, రోడ్లు, విద్యుత్ దీపాలు, తాగునీటి సదుపాయం, ఇళ్ల స్థలాలు వంటి సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. వాటి పరిష్కారానికి అధికారులతో మాట్లాడి ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా కురసాల కన్నబాబు మాట్లాడుతూ గడపగడపకూ మన ప్రభుత్వం ద్వారా ప్రభుత్వపరంగా ప్రజల వద్దకు ధైర్యంగా వెళ్ల గలుగుతున్నామని, ఎన్నికల ముందు తమ నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను నవరత్నాల పథకాలు ద్వారా అందజేస్తున్నామన్నారు. ఎటువంటి అవినీతి, అవకతవకలకు తావులేకుండా పారదర్శకంగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకే నేరుగా అందజేస్తున్నామన్నారు. అవ్వాతాతలకు పింఛన్ల పెంపుతో పాటు, అర్హులైన ప్రతి ఒక్కరికీ నివాస స్థలాలు, ఇంటి రుణాలు మంజూరు చేశామన్నారు. ఆసరా, చేయూత, అమ్మ ఒడి, విద్యాదీవెన, విద్యాకానుక, వసతి దీవెన, రైతు భరోసా తదితర పథకాల ద్వారా ఆదుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, సీనియర్ నాయకుడు గోపిశెట్టి బాబ్జీ, తమ్మవరం ఉప సర్పంచ్ గొల్లపల్లి దొరబాబు, నాయకులు గొల్లపల్లి సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

రూ.1.5 కోట్లతో షాదీఖానా : ఎమ్మెల్యే ద్వారంపూడి



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: రూ.1.5 కోట్లతో షాదీఖానా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి చెప్పారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ రైతు బజార్ సమీపంలోని ఖురేషి మసీదులో గురువారం సాయంత్రం జరిగిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. అదే ప్రాంతంలో కబేళా ఏర్పాటుకు అర ఎకరం స్థలం కూడా కేటాయించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ముస్లిం మైనార్టీల అభివృద్ధి, సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రంజాన్ సందర్భంగా ఆయన ముస్లింలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మసీదు అధ్యక్షుడు అబ్దుల్ రిద్వాన్, గౌరవాధ్యక్షుడు ఎండీ అస్గర్, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ అబ్దుల్ బషీరుద్దీన్, ముస్లిం ప్రతినిధులు ఇక్బాల్ అలీ, రెహ్మాన్‌ఖాన్, బాషా, రహీం తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి చట్టబద్ధ గ్రామసభలు

కరప: మండల పరిధిలో ఏడాదికి నాలుగుసార్లు చట్టబద్ధ గ్రామసభలు నిర్వహించాల్సి ఉందని, అందుకు ప్రత్యేకాధికారులను నియమించినట్టు ఈఓ పీఆర్డీ ఎస్వీ శ్రీనివాసరావు తెలిపారు. కరపలో గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. నాలుగు రోజుల పాటు ఈ సభల నిర్వహణకు ఏర్పాట్లు చేశామని, శుక్రవారం అరట్లకట్ట, నడకుదురు, గురజనాపల్లి, పెనుగుదురు, కొంగోడు, కొరుపల్లి, వేళంగి గ్రామాల్లో, శనివారం గొడ్డటిపాలెం, ఉప్పలంక, పాతర్లగడ్డ, గొర్రిపూడి, కరప, సిరిపురం, జి.భావారం, కూరాడలలో, 17న జెడ్.భావారం, వాకాడ, యండమూరు, పెద్దాపురప్పాడు, విజయరాయుడుపాలెంలలో, 18న వేములవాడ, వలసపాకల, పెదకొత్తూరు గ్రామాల్లోను గ్రామ సభలు జరుగుతాయన్నారు. గ్రామ ప్రత్యేకాధికారులుగా తనతో పాటు ఎంపీడీఓ కర్రె స్వప్న, తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, ఎంఈఓ కె.బుల్లి కృష్ణవేని, ఏఓ గుత్తుల భీమశంకరరావు, మండల ఇంజినీరింగ్ అధికారి జి.శైలజ, ఏపీఎం ఎంఎస్‌బీ దేవి, ఏపీఓ ఈ.వెంకటరమణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ వి.వర్ధన్, డీటీ కె.అనిల్‌కుమార్, ఈసీ వై.నాగలోవ, ఆర్ఐ పేపకాయల మాచరావు తమకు కేటాయించిన గ్రామాల్లో సర్పంచ్‌లు, పాలకవర్గ సభ్యులతో కలసి గ్రామసభలు నిర్వహిస్తారని ఈఓపీఆర్డీ తెలిపారు.

ధనుంజయరాజుకు డాక్టరేట్



బాలాజీచెరువు: నిపుణుల బృందం సిఫార్సు మేరకు డిజైన్ అండ్ అనాలసిస్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్మార్ట్ ల్యామినేటెడ్ కాంపోజిట్ ప్లేట్స్ అంశంపై డి.ధనుంజయరాజు మెకానికల్ విభాగంలో సిద్ధాంత వ్యాసం రచించారు. దీనిని ధ్రువీకరించిన జేఎన్‌టీయూకే శుక్రవారం డాక్టరేట్ ప్రకటించింది. ఈ వ్యాసాన్ని ధనంజయరాజు జేఎన్‌టీయూ నరసారావుపేట మెకానికల్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్ వీవీ సుబ్బారావు పర్యవేక్షణలో సమర్పించారు.

తప్పులు లేని ఓటర్ల జాబితా రూపొందించండి

- కలెక్టర్ కృతికా శుక్లా
- రాష్ట్ర ఎన్నికల అధికారితో వీడియో కాన్ఫరెన్స్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: ఆంధ్రప్రదేశ్ ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) ముఖేష్‌కుమార్ మీనా అమరావతి నుంచి గురువారం సాయంత్రం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి కాకినాడ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కృతికా శుక్లా, ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులతో కలిసి హాజరయ్యారు. ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా రూపకల్పన పురోగతిని కలెక్టర కృతికా శుక్లా సీఈవోకు వివరించారు. ఓట్ల సవరణ జాబితా అభ్యంతరాలు పరిష్కారం, ఎలక్టోరల్ రోల్స్, బీఎల్ రిజిస్టర్, ఎన్నికల పిటిషన్లు పురోగతి, ఎపిక్ కార్డుల ముద్రణ, పంపిణీ, రాబోయే సాధారణ ఎన్నికల సన్నద్ధతపై సమీక్షించారు. అనంతరం కలెక్టర్ కృతికా శుక్లా జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతూ ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా రూపకల్పన నిరంతర ప్రక్రియని దీనిపై ఈఆర్‌వోలు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఈఆర్‌ఓలు క్షేత్రస్థాయి బీఎల్‌ఓలను సమన్వయం చేసుకుని తప్పులు లేని ఓటర్ల జాబితా రూపకల్పనకు కృషి చేయాలన్నారు. కాకినాడ నగరపాల సంస్థ కమిషనర్ ఆర్ మహేష్‌కుమార్, జెడ్పీ సీఈవో ఎన్వీవీ సత్యనారాయణ, డీఆర్వో కె.శ్రీధర్‌రెడ్డి, కేఎస్ఈజెడ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.మనోరమ, కొడా వీసీ సుబ్బారావు, కాకినాడ ఆర్డీవో బీవీ రమణ, కలెక్టరేట్ ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ఎం.జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

విద్యా ప్రకాశానందగిరి పుణ్యతిథి ఉత్సవాలు

బోట్‌క్లబ్: శ్రీకాళహస్తి శుకబ్రహ్మ ఆశ్రమ స్థాపకులు గీతా మకరంద ప్రకాశకులు విద్యా ప్రకాశానందగిరి 109వ పుణ్యతిథి ఉత్సాలను స్థానిక భోగిగణపతి పీఠంలో గురువారం నిర్వహించారు. భద్రాచల పాదయాత్రికుల గురుస్వామి ఆచార్య వాసుదేవ దీక్షితులు స్వామివారి చిత్రపటానికి పూలమాలల వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. పీఠం ఉపాసకులు దూసర్లపూడి రమణరాజు పాల్గొన్నారు.

నగరాభివృద్ధిపై ఎస్పీ, కమిషనర్‌లతో ఎంపీ, ఎమ్మెల్యే భేటీ



కమిషనర్ మహేష్‌ను కలసిన ఎంపీ గీత, ఎమ్మెల్యే ద్వారంపూడి, చంద్రకళాదీప్తి, శివప్రసన్న, పద్మశ్రీ తదితరులు



జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌ను కలసిన ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి, ఎంపీ గీత

కాకినాడ/కాకినాడ క్రైం: కాకినాడ నగరపాలక సంస్థ నూతన కమిషనర్ డాక్టర్ మహేష్ కుమార్ రావిరాలను ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. స్థానిక స్మార్ట్ సిటీ కార్యాలయంలో పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులతో కలసి నూతన కమిషనర్‌కు స్వాగతం పలికారు. నగరాభివృద్ధికి సంబంధించి పలు అంశాలపై వారు కమిషనర్ మహేష్‌కుమార్‌తో చర్చించారు. పారిశుద్ధ్యం, గృహ నిర్మాణం, పెండింగ్ పనులపై వారు చర్చించారు. ఈ కార్యక్రమంలో కొడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళా దీప్తి, వైఎస్సార్ సీపీ కాకినాడ నగర అధ్యక్షురాలు, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, మాజీ డిప్యూటీ మేయర్ పసుపులేటి వెంకటలక్ష్మి, మాజీ కార్పొరేటర్లు నల్లబిల్లి సుజాత తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ఎస్పీ సతీష్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసారు. జిల్లాలో శాంతి భద్రతలు నెలకొల్పడానికి తగిన చర్యలు తీసుకోవాలని, అందుకు తమ సహకారం ఎప్పుడూ ఉంటుందని వారు ఎస్పీ సతీష్‌కుమార్‌కు వివరించారు.

ఉత్సాహంగా జగనన్నే మా భవిష్యత్

- ఇంటింటా తిరిగిన వైఎస్సార్ సీపీ శ్రేణులు
- పథకాలు వివరించి ప్రజాభిప్రాయ సేకరణ



ప్రజలతో మాట్లాడుతున్న చంద్రకళాదీప్తి, శివప్రసన్న తదితరులు

కాకినాడ: నగరంలోని పలు డివిజన్లలో వైఎస్సార్ సీపీ నాయకులు, శ్రేణులు జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు. ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం పంపిన ప్రశ్నావళిని వివరిస్తూ ప్రజాభిప్రాయం తెలుసుకుంటున్నారు. తప్పుడు వాగ్దానాలతో ప్రజలను వంచించిన తెలుగుదేశం పాలనకు, హామీలు కచ్చితంగా అమలు చేసిన సీఎం జగన్ విధానాన్ని అర్థమయ్యేలా వివరిస్తున్నారు. వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు, మాజీ మేయర్ శివప్రసన్న మాట్లాడుతూ వెళ్లిన ప్రతి ప్రాంతంలోను ప్రభుత్వ పాలనపై ప్రజల్లో అనూహ్య స్పందన కనిపిస్తోందన్నారు. కొడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి మాట్లాడుతూ ప్రజలే స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ప్రభుత్వ పథకాలు పట్ల పొందుతున్న లబ్ధికి సంతోషం వ్యక్తం చేస్తూ ధన్యవాదాలు తెలియజేస్తున్నారని చెప్పారు. ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ మాట్లాడుతూ ఇటువంటి ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. మాజీ డిప్యూటీ మేయర్ పసుపులేటి వెంకటలక్ష్మి, పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. దుమ్ములపేట, జగన్నాథపురం, సూర్యనారాయణపురం, పెద్దమార్కెట్ తదితర ప్రాంతాల్లో ఈ కార్యక్రమం ఉత్సాహంగా సాగింది.

ఘనంగా ధనమహాలక్ష్మి తీర్థం



కొంగోడు గ్రామదేవత ధనమహాలక్ష్మి అమ్మవారు

కరప: కొంగోడు గ్రామదేవత ధనమహాలక్ష్మి (ధనమ్మ) తీర్థం గురువారం నిర్వహించారు. ముందురోజు రాత్రి తెల్లవార్లు గరగనృత్యాలు, గారడీ, డప్పు వాయిద్యాలతో జాతర నిర్వహిస్తారు. పరిసర గ్రామాలనుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించి, మొక్కులు తీర్చుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎస్ఐ నౌడు రామకృష్ణ ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. పలుగ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ పార్టీల నాయకులు అమ్మవారిని దర్శించుకున్నారు.

16న కందుకూరి జయంత్యుత్సవాలు

కాకినాడ కల్చరల్: బ్రహ్మధ్యాన సత్సంగ్ ఆధ్వర్యంలో ఈనెల 16వ తేదీ ఆదివారం ఉదయం స్థానిక గాంధీభవన్‌లో కందుకూరి వీరేశలింగం జయంత్యుత్సవాలు నిర్వహించనున్నట్టు సత్సంగ్ జాతీయ అధ్యక్షుడు ఎ.మణికంఠ తెలిపారు. అందరూ హాజరయి విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

రక్తదానంపై అపోహలు వద్దు

- కస్టమ్స్ ఏసీ సాధు నరసింహారెడ్డి



అత్యధిక సార్లు రక్తదానం చేసిన డిప్యూటీ కస్టమ్స్ కమిషనర్ రఘురామ్‌ను అభినందిస్తున్న అధికారులు

కాకినాడ: రక్తదానంపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించాల్సిన అవసరం ఉందని అడిషనల్ కస్టమ్స్ కమిషనర్ సాధు నరసింహారెడ్డి పేర్కొన్నారు. గురువారం కాకినాడ కస్టమ్స్ హౌస్‌లో రెడ్‌క్రాస్ సహకారంతో జరిగిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. రక్తదానం వల్ల ఆరోగ్యం పాడవదనే విషయాన్ని ప్రజలకు వివరించాలన్నారు. డిప్యూటీ కస్టమ్స్ కమిషనర్ రఘురామ్ మాట్లాడుతూ ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా జలియన్‌వాలా భాగ్ అమర వీరుల సంస్మరణార్థం ఈ రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. విశాఖ చీఫ్ కస్టమ్స్ కమిషనర్ సంజయ్‌తంత్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కస్టమ్స్ అధికారి రఘురామ్ 28వ సారి రక్తదానం చేసి పలువురి మన్ననలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సీహెచ్ వీరవెంకటరెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ కె.శివకుమార్, రెడ్‌క్రాస్ కార్యదర్శి శివకుమార్, కస్టమ్స్ సూపరింటెండెంట్లు సతీష్ సింగ్, ఈశ్వరరావు, చౌదరి, కన్నారావు, వెంకటేష్, పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

సంపద సృష్టించండి



వర్మీ కంపోస్టు తయారీని పరిశీలిస్తున్న ఈఓ పీఆర్డీ శ్రీనివాసరావు

కరప: గ్రామాల్లో ఏర్పాటు చేసిన చెత్త నుంచి సంపద తయారీ(ఎస్‌డబ్ల్యూపీసీ) కేంద్రాలను సక్రమంగా నిర్వహించి, వర్మీకంపోస్టు తయారుచేస్తే పంచాయతీలకు అదనపు ఆదాయం చేకూరుతుందని మండల ఈఓ పీఆర్డీ ఎస్వీ శ్రీనివాసరావు సూచించారు. గురజనాపల్లిలో గురువారం ఆయన పర్యటించి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించి సిబ్బందికి సూచనలిచ్చారు. పారిశుద్ధ్య పనులు నిర్వహించి, తడి, పొడి చెత్త విడివిడిగా సేకరించి, వర్మీ కంపోస్టు ఎలా తయారు చేస్తున్నదీ గ్రామకార్యదర్శి ఎస్కే నాగేంద్రకుమార్ వివరించారు. కేంద్రం నిర్వహణ పట్ల ఈఓపీఆర్డీ సంతృప్తి వ్యక్తం చేశారు.

క్రికెట్ టోర్నీ విజేత వేళంగి వారియర్స్



విజేతగా నిలిచిన వేళంగి వారియర్స్ జట్టు

కరప: మండలం వేళంగిలో అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని రమ్య చారిటబుల్ ట్రస్ట్ అధినేత డాక్టర్ పితాని అన్నవరం సహకారంతో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నీ విజేతగా వేళంగి వారియర్స్ నిలిచింది. వేళంగి హైస్కూలు గ్రౌండ్‌లో గురువారం వేళంగి టైగర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో వేళంగి వారియర్స్ విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన వారియర్స్ జట్టు 8 ఓవర్లలో 59 పరుగులు చేసింది. అనంతరం చేజింగ్‌కు దిగిన టైగర్స్ జట్టు 8 ఓవర్లలో 36 పరుగులు చేసి, ఓటమి పాలైంది. మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్‌గా దూల ప్రవీణ్ నిలిచారు. 16న డాక్టర్ అంబేడ్కర్ జయంత్యుత్సవంలో విజేతలకు బహుమతి ప్రదానం చేస్తామని నిర్వాహక వేళంగి గ్రాడ్యుయేట్ యూత్ ప్రతినిధులు ముడిగి కృష్ణ, ఎ.దుర్గాప్రసాద్, ఎర్రా విక్రమ్, చిట్టూరి అప్పన్న తెలిపారు.

ప్రకృతి వైపరీత్యాల బాధితులకు రూ.40 లక్షల విరాళం



గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు రూ.40 లక్షల విరాళం అందజేస్తున్న ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ శేషారెడ్డి, కార్యదర్శి సుగుణారెడ్డి

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఆదిత్య విద్యాసంస్థలు, అధ్యాపకులు సమకూర్చిన రూ.40 లక్షల విరాళాన్ని ప్రకృతి వైపరీత్య బాధితుల కోసం ఏపీ గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్‌కు గురువారం విద్యా సంస్థల చైర్మన్ ఎన్.శేషారెడ్డి గవర్నర్ కార్యాలయంలో అందజేశారు. ఈ మేరకు గవర్నర్ వారిని అభినందించారు. ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ శేషారెడ్డి, కార్యదర్శి సుగుణారెడ్డి, అకడమిక్ డైరెక్టర్ బీఈవీఎల్ నాయుడు, రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

నూకాలమ్మ హుండీల లెక్కింపు

బోట్‌క్లబ్: స్థానిక టూటౌన్ నూకాలమ్మ అమ్మవారి ఆలయంలో హుండీలను గురువారం దేవదాయశాఖ అధికారుల సమక్షంలో లెక్కించారు. 36 రోజుల వ్యవధిగాను రూ.4.89 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈఓ లక్ష్మణరావు తెలిపారు. ఈ హుండీల లెక్కింపులో దేవదాయశాఖ తనిఖీదారు వడ్డి ఫణికుమార్, భక్తులు పాల్గొన్నారు.

నేటి నుంచి వామపక్షాల ప్రచారభేరి

కాకినాడ సిటీ: బీజేపీ ప్రభుత్వం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ఈ నెల 14 నుంచి 30వ తేదీ వరకు ప్రచార భేరి నిర్వహిస్తున్నట్టు వామపక్షాల నాయకులు తెలిపారు. గురువారం సుందరయ్యభవన్‌లో ప్రచార భేరి పోస్టర్లను ఆవిష్కరించారు. నాయకులు తాటిపాక మధు, ఎం.రాజశేఖర్, కె.బోడకొండ, దువ్వా శేషుబాబ్జీ తదితరులు పాల్గొన్నారు.